చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్‌గా మోహన్‌రెడ్డి



చందానగర్: చందానగర్ సర్కిల్– 21 నూతన ఉపకమిషనర్‌గా మోహన్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల డీసీగా పనిచేసిన వంశీకృష్ణ సెలవుపై వెళ్లగా కూకట్‌పల్లి జోన్ పారిశుద్ధ్య విభాగం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఆయన ఖైరతాబాద్ సర్కిల్‌లో పని చేశారు.

శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌గా ముకుంద్‌రెడ్డి



శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పి.ముకుంద్‌రెడ్డి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేసిన ఆయన్ని శేరిలింగంపల్లి సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన రజనీకాంత్‌రెడ్డి ఖైరతాబాద్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన చిన్నారులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ను లిటిల్ టాట్స్ ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు శనివారం సందర్శించారు. సీఐ వెంకటేశ్వరరావు పోలీస్‌స్టేషన్ గురించి చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోడ్ల ముచ్చట..

రోడ్ల విస్తరణలో అంతులేని జాప్యం ● భూసేకరణ, నిధుల సమస్యతో సతమతం

రాయదుర్గం: రోడ్ల విస్తరణలో జాప్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. నగరంలో ప్రాధాన్యత కలిగిన ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ప్రధాన రోడ్ల విస్తరణలో ఏళ్ల తరబడి జాప్యం నెలకొంటోంది. ప్రధానంగా నిధుల విడుదల, భూసేకరణ సమస్యగా మారింది. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఔటర్ రింగురోడ్డు వరకున్న ప్రధాన రోడ్డును వైట్‌టాపింగ్ రోడ్డుగా మార్చాలని పదేళ్ల క్రితమే నిర్ణయించారు. దీంతో రూ.50 కోట్లతో చేపట్టాల్సిన బీటీ రోడ్డును, మూడు లేన్ల వైట్‌టాపింగ్ రోడ్డును ఒకవైపు మాత్రమే వేశారు. ఇది జరిగి ఆరేళ్లవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో విప్రో సర్కిల్ నుంచి ఔటర్‌రింగురోడ్డు వరకు మిగిలిపోయిన రోడ్డు, ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఔటర్‌రింగురోడ్డు వరకు మరోవైపు ఉన్న ప్రస్తుత బీటీరోడ్డు కాస్తా వైట్‌టాపింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్లు వస్తున్నాయి.

నేటికీ పూర్తికాని హెచ్‌సీయూ డిపో–వట్టినాగులపల్లి రోడ్డు

హెచ్‌సీయూ డిపో నుంచి వట్టినాగులపల్లి వరకున్న రోడ్డు విస్తరణ చేయాలని 8 ఏళ్ల క్రితం అప్పటి మంత్రి కేటీరామారావు ఆదేశించినా ఇప్పటి వరకు అసంపూర్తిగానే ఉంది. ఆరులేన్ల రోడ్డు, ఇరువైపులా డక్ట్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, డివైడర్‌పై గ్రీనరీ ఏర్పాటు చేయాలని తలపెట్టారు. కానీ పూర్తిస్థాయిలో ఇప్పటికీ చేయలేదు. నిధుల విడుదలలో జాప్యంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు రోడ్డు పూర్తి చేస్తామని ప్రకటిస్తున్నారు.



ఖాజాగూడలో 8 లేన్లకు ఆరులేన్లతో నిర్మించిన మోడల్ రోడ్డు

ఖాజాగూడ మోడల్‌రోడ్డు ఆరులేన్లకే పరిమితం..?

మధురానగర్ కూడలి నుంచి ఖాజాగూడ, ఓఆర్‌ఆర్ అండర్‌బ్రిడ్జి, నానక్‌రాంగూడ కొత్త రోడ్డు నుంచి విప్రో సర్కిల్ వరకు రూ.45 కోట్లతో రోడ్డును విస్తరించాలని తలపెట్టారు. కానీ మధురానగర్ నుంచి ఔటర్‌రింగురోడ్డు అండర్ బ్రిడ్జి వరకు ఆరులేన్ల రోడ్డును సెంట్రల్ డివైడర్ గ్రీనరీతో పూర్తి చేశారు. ఈ మోడల్‌రోడ్డు 8 లేన్ల ప్రణాళిక ఉండగా కొన్నిచోట్ల ఆరులేన్లు, మరి కొన్ని చోట్ల నాలుగులేన్లు వేశారు. సెంట్రల్ లైటింగ్ స్థానంలో ఇరువైపులా రోడ్డు చివరన లైట్లను ఏర్పాటు చేయగా, డక్ట్, డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం వదిలేశారు. ఇక సర్వీస్‌రోడ్డు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం చేశారు. కాగా భవిష్యత్‌లో 8 లేన్ల రోడ్డు ఏర్పాటుకు తమ ఇళ్లను, దుకాణాలు, స్థలాలను ఇవ్వమని పలువురు ఖరాకండిగా చెబుతున్నారు. మరి అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

రాయదుర్గం–లింగంపల్లి రోడ్డుకు భూసేకరణ సమస్య

రాయదుర్గం–లింగంపల్లి రోడ్డును 200 ఫీట్లుగా మార్చాలని తలపెట్టారు. కానీ గచ్చిబౌలి, బయోడైవర్శిటీ పార్కు కూడలి, రాయదుర్గంలో ఫ్లైఓవర్ల నిర్మాణంతో దాదాపు ట్రాఫిక్ సమస్య తీరినట్లే. కానీ ఈ రోడ్డు విస్తరణకు పలుచోట్ల భూసేకరణ సమస్య నెలకొంది.



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో వైట్‌టాపింగ్ వేయాల్సిన రోడ్డు ఇదే..

పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



గోపికల వేషధారణలో చిన్నారులు

మియాపూర్: మియాపూర్ మదీనగూడలోని శ్రీనిధి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపిక, బలరాముని వేషధారణతో ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి గోవర్ధనగిరి తిరునాళ్లు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ, మలేషియా టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు గోవర్ధనగిరి తిరునాళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 5:15 గంటలకు స్వామి వారి మేలుకొలుపు, సుప్రభాత సేవ, 5.30 గంటలకు సుగంధ పరిమళ ద్రవ్య పంచామృతాభిషేకం అనంతరం వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ సేవలు, 8 గంటలకు బాలభోగ నివేదన, ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, ఋత్విక్‌వరుణ పంచగవ్య ప్రాసన, గోపూజ, మండప ఆరాధనలు, అంకురార్పణ, ధ్వజారోహణ, 8:30 గంటలకు వేదపారాయణం, గోపూజ, 9 గంటలకు స్వామి మహా కల్యాణం, 12:30 గంటలకు శ్రీవారి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు పుత్రకామేష్టి హోమం, నీరాజనం, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, 6 గంటలకు 8 సంవత్సరాల లోపు చిన్నారులకు చిన్నికృష్ణుడి వేషధారణ పోటీలు, 7 గంటలకు ఉట్టి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఓటరు జాబితా ప్రకారం ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: ఓటరు జాబితా ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారని శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ (ఎస్ఎస్‌ఆర్) 2025పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఎల్‌ఓల ఇంటింటి సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఫోన్ యాప్‌లో ఓటర్ల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారని, ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు అక్కడ ఉన్నారా, లేదా ఎక్కడికైనా షిఫ్ట్ అయ్యారా, పేరు నమోదులో తప్పులు ఉన్నా, ఓటరు మరణిస్తే కుటుంబ సభ్యులతో వివరాలు తీసుకొని వాటిని నమోదు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ బాలవర్ధన్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ వింగ్, హార్టికల్చర్, శానిటరీ విభాగం సహకారంతో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ భీంసింగ్ పర్యవేక్షణలో క్యాంపస్‌లోని హ్యుమానిటీస్ భవనం పరిసరాలతో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. భవనంపై పేరుకపోయిన వ్యర్థాలు, చెట్ల కొమ్మలు, ఎండిన ఆకులను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శానిటరీ, హార్టికల్చర్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

కిష్టాయపల్లి మూగజీవాల మృతిపై పీసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జిన్నారం మండలం కిష్టాయపల్లి గ్రామంలో గత మూడు రోజుల క్రితం కాలుష్య జలాలు తాగి గేదెలు మృతి చెందిన విషయం విదితమే.. ఇందుకు కారణమైన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన రైతు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవిని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కోరారు. శనివారం పీసీబీ మెంబర్ సెక్రటరీ రవితో ఫోన్‌లో మాట్లాడారు. కొన్ని పరిశ్రమలు హానికారక రసాయనాలను చెరువులు, కుంటల్లోకి విడుదల చేయడం మూలంగా మూగజీవాలు మృతి చెందుతున్నాయని తెలిపారు. కిష్టాయపల్లి గ్రామానికి చెందిన యువ రైతు బొశెట్టి సాయికుమార్‌కి చెందిన 12 గేదెలు రసాయనాలతో కూడిన నీటిని తాగి మృతి చెందాయని తెలిపారు. సాయికుమార్ పాడి పరిశ్రమపై మక్కువతో డెయిరీఫాం ఏర్పాటు చేస్తే.. ఫార్మా పరిశ్రమల నిర్లక్ష్యం మూలంగా ఆర్థిక నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన మండలి మెంబర్ సెక్రటరీ రవి .. వచ్చే వారం క్షేత్రస్థాయి పర్యటన చేస్తామని చెప్పారన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం



ప్రారంభోత్సవంలో నాయకుడు రవికుమార్ యాదవ్, ఆర్యవైశ్య ప్రముఖులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఆర్యవైశ్య సంఘం భవనం మొదటి అంతస్తుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భిక్షపతి యాదవ్ ఆర్యవైశ్య సంఘం భవనానికి కావాల్సిన మౌలిక వసతులకు తోడ్పాటు అందించారని తెలిపారు. సంఘానికి సంబంధించి సహకారమందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు పుల్లయ్య గుప్త, అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, జె. శ్రీనివాస్‌గుప్త, కొండలరావు గుప్త, ప్రవీణ్‌గుప్త, జి. శ్రీనివాస్‌గుప్త, బీజేపీ నాయకులు నర్సింగ్ యాదవ్, సందీప్ గౌడ్, చాంద్, సురేష్, రాజు, హరి పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం పంపిణీ

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని గుమ్మడిదల ,జిన్నారం మండలం ఖాజీపల్లికి చెందిన నలుగురు రైతులకు విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన 3 లక్షల 20 వేల రూపాయల నష్టపరిహారం చెక్కులను శనివారం ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవల 8 గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి నష్టపరిహారం అందించామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


మియాపూర్: మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 26న సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు మియాపూర్ టెంపుల్ ప్రెసిడెంట్ శ్రీరామ్‌దాస్ ప్రభుజీ ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్ హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీ కమ్యూనిటీహాల్‌లో సోమవారం ఉదయం 7 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ దర్శనం, అభిషేకం, సాంస్కృతిక ప్రదర్శనలు, కీర్తనలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 27న (మంగళవారం) ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నందోత్సవం, శ్రీల ప్రభుపాద, వ్యాసపూజలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన



మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం భారతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో మహాగణపతిం, దశావతార శబ్దం, మరకతమణి, మూషిక వాహన, సతులారా చూడరే, చక్కని తల్లికి, రామాయణ శబ్దం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో కళాకారులు సాయిహర్షిత, గోహిత శ్రీదేవి, నిర్విఘ్న, బహుళిక, వెంకటశ్రావ్య, సంయుక్త, నిఖిత, జైష్ణవి, భువన, లేఖ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్‌థెరిసా జయంతి



మాదాపూర్: మదర్ థెరిసా జయంతిని మాదాపూర్‌లోని స్వాతి హైస్కూల్‌లో శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి హాజరై ప్రసంగించారు. సామాజిక సేవ ద్వారా అమ్మగా మారిందన్నారు. ఎందరో అభాగ్యులకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో రాగం మల్లికార్జునయాదవ్, అసోసియేషన్ సభ్యులు కొత్తపల్లి కోటేశ్వరరావు, వి.ఫణికుమార్, మూర్తి, వాణి సాంబశివరావు, డాక్టర్ బీసీ రామన్న, శ్రీనివాస్, డీవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి వృథా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెలిమెల నుంచి రింగ్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో మంజీరా పైప్‌లైన్ వాల్వ్ వద్ద ప్లాస్టిక్ పైపు వేసి నీటిని వదిలేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సందయ్య పార్కును అభివృద్ధి చేయాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో ఉన్న సందయ్య పార్కును అభివృద్ధి చేయాలని శనివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కాలనీ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోకుల్‌ప్లాట్స్‌లోని పార్కును అభివృద్ధి చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సాంబయ్య, గుండా ప్రభాకర్, చంద్రప్రకాశ్‌రెడ్డి, దేవనాయక్, హరి, నిరంజన్, బాలరాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన సంగీత అయ్యర్ భరత నాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, శాంతాకారం, త్యాగరాజకృతి, అన్నమాచార్య కీర్తనలను ప్రదర్శించారు. అలాగే సత్యం డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నాట్యగురువు మేళ్ళచెరువు కామేశ్వరీ శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో కళాకారులు కళ్యాణి, అక్షిత, కీర్తన, సర్వాణి, శ్రీయ, అనన్య తదితరులు పాల్గొన్నారు.

మోహిని భరతనాట్య అరంగేట్రం



మాదాపూర్: కళాకారిణి అన్నికా మోహిని ఆత్మకూరి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం మోహిని ఆత్మకూరి భరతనాట్య అరంగేట్రం నిర్వహించారు. ఇందులో గణేశ కీర్తనం, జతిస్వరం, కీర్తనం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణియన్ గురువులు ప్రవీణ, శ్రీనివాస్,మృదంగం అర్జున్ ఆత్మకూరి ,మోటివేషనల్ స్పీకర్ కేవి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో 5కే రన్



మాదాపూర్: ప్రజలు చురుకైన జీవనశైలిని గడిపేందుకు నడక, పరుగు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెట్సా తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం 5కే రన్ ను నిర్వహించారు. భారతదేశంలో మొట్టమొదటి రన్నింగ్ గ్రూప్ అయిన హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ 5కే రన్‌ను నిర్వహించింది. ఈ రన్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయపాల్ రెడ్డి, నిరీష్‌లాలన్‌లతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 8వేల మంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పటాన్‌చెరు టౌన్: సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి అన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు జిల్లా కళాబృందం పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలో కళా ప్రదర్శన నిర్వహించారు. డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు సునీల్, రమేష్, దుర్గేష్, సంధ్య,వినేష్,నవీన్, శంకర్ పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్‌లో ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఊట్ల చంద్రారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని శివాలయంలో శనివారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి బస్తీ వాసుల నుంచి విశేష స్పందన లభించింది. బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు నిహారిక, శ్రేయ, నర్సులు సునీత, లావణ్య, వైద్యశిబిరం ఆర్గనైజర్ ఓబుల్‌రెడ్డి, ఫార్మాసిస్ట్ దేవదాస్‌తో పాటు ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు, కొండా విజయ్‌కుమార్ తదితరులు

రాయదుర్గం: ఎంజీ గాయత్రి స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో రాయదుర్గంలోని గంగోత్రి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. నగరవ్యాప్తంగా 30కి పైగా వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అండర్–16 కబడ్డీలో మొదటిస్థానం, అండర్–14 కబడ్డీలో మొదటిస్థానం, అండర్–12 కబడ్డీలో రెండవ స్థానం, అండర్–12 రన్నింగ్ రేస్‌లో రెండవ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. శనివారం రాయదుర్గంలోని గంగోత్రి పబ్లిక్ ప్రాంగణంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ సలికూటి సర్వేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కన్నానాయుడు అభినందించారు. పీఈటీ రమేష్, హాకీ సంఘం జిల్లా చైర్మన్ కొండా విజయకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో అవగాహన సదస్సు



పంచశీల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ కానిస్టేబుల్స్

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో శనివారం కూకట్‌పల్లి షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు మాట్లాడుతూ ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. హెల్ప్‌లైన్ నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. రాత్రివేళ భద్రంగా ఇంటికి వెళ్లేందుకు కూడా పోలీసులు ప్రత్యేక యాప్‌లు రూపొందించారని, వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ కూకట్‌పల్లి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు బస్టాండ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి, స్టేషన్ మేనేజర్

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్ , సికింద్రాబాద్ జంట నగరాలలోని బస్టాండ్లలో పటాన్‌చెరు బస్టాండ్‌కు ఉత్తమ బస్టాండ్ అవార్డు లభించిందని డిపో మేనేజరు మురళీధరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండి సజ్జనార్ చేతుల మీదుగా డిపో మేనేజరు మురళీధరరెడ్డి, స్టేషన్ మేనేజరు ఇషాక్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు మాట్లాడుతూ... ఉత్తమ బస్టాండు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే బస్టాండులో బస్‌పాసు సెక్షను, కార్గో సేవలు అందిస్తున్నామని తెలిపారు.

యువకుడు అదృశ్యం

మియాపూర్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కండ్లకుంట గ్రామానికి చెందిన సాయికిరణ్ (24) ప్రైవేటు ఉద్యోగి. నెల రోజుల కిందట మియాపూర్ గోకుల్ ప్లాట్స్ వెంకటరమణ కాలనీలో ఉంటున్న పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. ఉద్యోగం చూసుకున్నాడు.కాగా ఈ నెల 21న ఉదయం 8 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల, స్నేహితులు, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందిన సోదరుడు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.